శ్రీ పులిచెర్ల సుబ్బారావు

# హంసావళి

వెన్నెలకల్లు అంటే మీకర్థంగాదు. చంద్రకాంత శిల అంటే తెలుస్తుంది గావును. అలాంటి వెన్నెలకల్లు మా అందమైన అన్నయ్య యిల్లు.

అన్నయ్య కనుదమ్ముల నుండి వెన్నెల కురుస్తోంది.

"అన్నయ్యా! ఓ కథ చెప్పవుగద ?"

"చెప్పేను. కాని ఇది దిగంబరకవిత కాదు. విని మెచ్చేవో? ఇదియేటి తగులమని నొచ్చేవో ?"

"తొంగలి ఱెప్పల మెఱుగులుగల తొయ్యలికథ అయితేచాలు. ఎల్లరూ మెచ్చేరు."

"తెలుగునాడు తీరు తియ్యములు ఇప్పటికీ అంతేనా ?"

"ఎప్పటికీ అంతే."

"బాగు. మఱి విను."

*　　　　*　　　　*

పూదోటలో విరిపొద మాటున నెలరాల తిన్నెపై పొంగరే యవ్వనం రంగారగా సుకుమారంగా ఆసీనురాలై వుంది హంసావళి. చిరునవ్వు ఆ జవ్వని మోముకు వింత చెలువం సంతరిస్తూ వుంది. ఆమె దరహాస చంద్రికలకు నెలరాల తిన్నె కరిగిపోయేనని జంకుతూంది, చెంత నిలుచున్న చెలి అశోకకళిక.

మరోవంక వన్నెలు వెలార్చే చిన్నెల చిలక కనకమంజరి నిలుచుని వుంది. ఆ ముగ్గురూ పువ్వుల వంటి వారే. ముగ్గురూ పరవశ స్థితిలోనే ఉన్నారు. ముగ్గురి కనుచూపులూ కమ్మవిలుతుని తూపులై ఎదుటనున్న చిత్రపటంపై కురుస్తున్నాయి.

పటంలో మన్మథ మన్మథుడున్నాడు. అతడు వారి కన్నె మనసులను చూఱగొన్నాడు.

హంసావళి కన్నులు అనిమేష స్థితిని దాల్చాయి. ఆమెలో కదలిక లేదు. కాని కనకమంజరి పెదవులు కంపిస్తున్నాయి; ఉత్కళికలు విలసిల్లుతున్నాయి; ఒడలంతా పొడగానరాని పులకలు పొడముతున్నాయి.

పిల్లతెమ్మెర తాకిడికి అశోకకళిక ముందుగా తేరుకుంది. మదనుడామెపై కదనం మానుకున్నాడు.

"రాకుమారీ!" సుతారంగా పిలిచింది అశోకకళిక.

చిఱుచెమటకమ్మి ఆరిపోయిన హంసావళి ముద్దులమోములో కదలికలేదు.

కాని కనకమంజరి ఉలిక్కిపడింది. ఇంతవరకూ కంతుని పూలవానలో నానిన ఆమెకు హఠాత్తుగా నానకలిగింది.

"రాకుమారీ!" అని వీనులారసి పిలిచి, హంసావళి చెక్కిలి నొక్కింది మంజరి.

పులకింతలు వింత వింతలుగా వెల్లువలుకాగా, ఆనందాశ్రువు లొలుకగా, హంసావళి తన తెలిరెప్ప లల్లార్చి, చెలికత్తెల నొకపరి తిలకించి, నునుసిగ్గున వదనాంబుజము వాల్చినది.

ఫక్కున నవ్వింది అశోకకళిక. ఆమె దంతదీప్తులకు వనమంతా విచ్చింది.

"ఈ కనులవిందు ఒడలి పొందుగా మారే తీయ తీయని క్షణం ఎప్పుడో అమ్మాయిగారికి ?"

"ఆ పార్వతీమాయి కరుణించి కమలాకర రాకుమారుని కూర్చినప్పుడు" అంది కనకమంజరి.

కమలాకరుని పేరు వినగానే హంసావళి ఉప్పొంగి మంజరి చేయి నొక్కింది.

"నీవిది వినలేదా మంజరీ ?" అంది అశోకకళిక.

"ఏమది మదిరాక్షీ ?" దీర్ఘం తీసింది మంజరి.

"ఏలినవారు వేత్రవతీ తీరంలో విడిసిన ఒక రాజుకు ఈరాత్రే అమ్మాయిగారి నిస్తానని వాగ్దానం చేశారట !"

పిడుగుపడినట్లు తిన్నెపై సొమ్మసిల్లింది హంసావళి.

"ఇంతటి వెరవిడివేమే కళికా? రాకుమారి గుండెనువ్రీల్చావు గదే !" అని కసరింది మంజరి. పూదొన్నెలతో నిర్మలవారిని ముంచి తెచ్చి హంసావళి చక్కని చిక్కని ముఖముపై చిలకరించారు.

కొంతవడికి తెప్పరిల్లింది రాకుమారి. కాని కదలికలో వెనుకటి వడిలేదు. మంజీరాల్లో మునుపటి సవ్వడిలేదు.

"ఆ రాజకుమారుని పేరూ కమలాకరుడేనమ్మా !" అంది అశోకకళిక.

''నిజమా కళికా ?'' అంటూ హంసావళి చెంగున లేచి నిల్చినది. కళికను ఎడదకు హత్తుకొన్నది ఆమెచెక్కిలి ముద్దుగొన్నది. అందరికీ కులుకు పుక్కిలింతలైనది.

కాని అంతలోనే రాకుమారి మానసవీధి శంకా కళంకితమైనది. మదనుని కైదువలకు సదనమైన ఆమె వదనముపై సందేహచ్ఛాయలు దోబూచులాడాయి. కళికను వదలి చిత్రపటంపై మరల మరల దృష్టి సారించింది. తేనెలూరు ఆమె వాతెఱ బిగువులో ఏదో దృఢ నిశ్చయం తొంగిచూచింది. యవ్వన భారంతో జవ్వాడే ఆమె సన్నని నడుముకొక స్థిరత కలిగింది.

''మంజరీ! పటం తీసికొనిరావే !'' అని తన పడక గదిలోనికి నడక సాగించింది హంసావళి. ఆమె గమన విన్యాసం చూచి పొంతనున్న కొలనులోని రాయంచలు సిగ్గుపడి తలలు వంచి జలమున మునిచినాయి.

ఈ మార్పుకు నివ్వెఱ పైగొనగా నిలుచుండి పోయింది కళిక. విదిశా నగరాన్ని హఠాత్తుగా తాకిన భీకరమారుతం తాకిడికి ఉపవనమంతటా పుప్పొడి రాలింది.

గదిలో అద్దంలో ప్రతిఫలించే కమలాకరుని చిత్తరువునుండి చిత్తజోడు హంసావళి ఎడదపై భీషణంగా దాడి సాగిస్తున్నాడు. కనకమంజరి కూడా అదే స్థితిలో ఉండటం ఆమె గమనించలేదు.

''ఈమారాకారుడే ఆ కమలాకరుడని తెలిసికొనడం ఎలానే చెలీ ?''

''కనులారా తిలకించి పులకిస్తే సరి.''

''ఎవరు ? నేనా మంజరీ ? నగరం వెలువడి, నదీతీరంచేరి, శిబిరం చొరటం నాకు అగునా ? తగునా ?''

''మీరు కాదమ్మా, నేను.''

''నీకయితే మాత్రం ఎలా సాధ్యం ?''

''వేషం మారిస్తే సరి. చూస్తూ ఉండండి. క్షణంలో సగం...''

కనకమంజరి నెఱజాణ. హంసావళికి అచ్చెరువు గొలుపుతూ వేషం మార్చసాగింది. తావులు వెదజల్లు పూవులను పోద్రోసి, జడ ముడిసవరించింది; పట్టుపుట్టము సడలించి ప్రాతచెంగావి కట్టింది; చందన మృగనాభి చర్చలు కడిగివేసి నిర్మలమైన విభూతి మృదులమైన మేనిపై అలదినది; ముక్తామయ తాటంకములు తీసివేసి, స్ఫటికములు చెవులకు పెట్టినది; తొడవులన్నిటిని ఊడ్చి రుద్రాక్షలు దాల్చినది; తపస్వినియైనది.

హంసావళి మది మెచ్చినది.


# ఆంధ్రపత్రిక

**ఆంధ్రపత్రిక ఇప్పటికి ఇంచుమించు ఏడు దశాబ్దాలుగా తెలుగు వారికి సేవ చేస్తోంది.**
**విజయవాడ మరియు హైదరాబాద్ నుండి వెలువడుచున్నది.**

తాజా వార్తలు, పక్షపాతం లేని వ్యాఖ్యలకు ఆంధ్రపత్రిక పెట్టింది పేరు.

ఇవి కాక అన్ని రకాల అభిరుచులనీ సంతృప్తిపరచే ఇతర శీర్షికలు ఎన్నో మీరు ఆంధ్రపత్రికలో చదవగలరు !

★ మనసినిమాలు
★ దినవారఫలాలు
★ ఇది నారీదృక్పథం
★ డాక్టరు కబుర్లు
★ మా ఊరి సమస్య
★ అరణ్యకాండ
★ కలైడోస్కోపు కార్టూన్
★ శ్రీకృష్ణభాగవతం
★ వింత యదార్థం
★ ఇంకా — వ్యాసాలు, గేయాలు, కార్టూన్లు ... ...

ఎప్పటికప్పుడు ఆంధ్రపత్రికలో సరికొత్త ఆకర్షణలు ప్రవేశపెడుతూనే ఉంటాము !

వెంటనే ఆంధ్రపత్రిక చందాదారుగా చేరండి !

మేనేజరు, ఆంధ్రపత్రిక

''సెబాస్! ఆహార్యం కుదిరింది. ఇక తెరచుండి వెలువడు.''

కనకమంజరి ఒరులెఱుగకుండ విదిశానగరం వెలువడింది. వేత్రవతీ తీరం చేరి, కమలాకరుని స్కంధావారం దరియ జొచ్చినది.

కమలాకరుడు పేరోలగమున సింహాసనంపై అధిష్ఠించి యున్నాడు. ఆతని పాదారవిందములు సామంతరాజుల కిరీట రత్న కాంతులచే విరాజిల్లుతున్నాయి. వింజామరల వీవనలకు అతని కుంతలములు అలవోకగా సంచలిస్తున్నాయి.

అల్లంతదూరాన అతనిని చూచి అతడే అనుకుంది మంజరి. మానసమూ, చూపూ ఆ అగణిత విలాసునిపైనే లగ్నం కా దరిజేర నరిగినది. చిత్రపటంలోని కమలాకరుడే యీ కమలాకరుడు!

''అనంతరాజ్య ప్రాప్తిరస్తు!'' అంటూ భూతిని ప్రసాదించింది.

రాకుమారుడు చేయిచాచినాడు. కమలాకరుని కరసరోరుహము ఆమె కరమును అల్లనల్లన తాకినది.

తోడనే కుసుమశరుడు క్రొత్త భక్తురాలిని తన మెఱుగు బాణములతో వేటాడాడు. అతను సాయకములు తాకగానే చెలువ హృదయం దళితమైంది. తోడనే పులకలు, చెమట, వణకు కలిగాయి. కా విభూతి మాటున అవి అడగాయి.

''తారుణ్యంపై కారుణ్యం విడనాడి తపస్వినులైన తామెవరో? ఏ పనిపై ఈ భక్తుని యిలా అనుగ్రహించారు?''

కనుల విందుకు వీనుల విందు తోడుకాగా పరవళ్ళుత్రొక్కే పరవశం కనకమంజరిని ఓ పట్టాన వీడలేదు.

''నేను బహుదేశ సంచారిణిని. నిఖిల జగత్తును చూడాలని నా ఆకాంక్ష. నీవు సాక్షాత్తూ శ్రీపతివేనని విని చూడవచ్చాను. కాని ఆయన కుమారుణ్ణి చూస్తున్నాను.''

కపట తపస్విని పొగడ్తకు రాకుమారుని ముఖారవిందంపై దరహాసం విరిసింది. ఆమెకు ఉచిత సత్కారములు గావించి వీడుకొలిపినాడు.

కనకమంజరి నగరిదెస మరలింది.

ఆమెఅంతరంగంలో కంతుడు విశృంఖలంగా నర్తిస్తున్నాడు.

''చిత్తరువును మించి, మించువలె వెలిగిపోతోంది ఇతని మూర్తి. ఈ సరసోక్తులు, ఈ అవికారత, ఈ విలాసము, ఈ ...సిరి, ఈ ఉదారత ఏ ధరావరులందును లేదు. ఈ సొబగుని ...ధునిగ పొందగల పుణ్యవతి ఎవతెయో!? తానే అయితే?...''

కనకమంజరి కపటోపాయములు చింతింపనారంభించింది. ...నవత్వాన్ని సమూలంగా విస్మరించింది. దుశ్చింతకు మాయోపాయం తోడైంది. రాత్రి లగ్నం కావటం తన కనుకూలమని ...లికింది.

వేయికన్నులతో తనకై ఎదురుచూచే బాలిక పాలికివచ్చింది.

''మంజరీ! ఈతడు నా మానస కమలాకర మిత్రుడైన కమలాకరుడేనా? చంపక చప్పన చెప్పు.''

మంజరి ముఖాన్ని వాడ్చింది; సన్నగా ఏడ్చింది.

''కమలాక్షీ! ఈతడు కమలాకర భూ రమణుడు కాడు. ఆ పేరివాడేకాని రాజమర్కటం! వృద్ధుడు, వికృతవేషి, క్రూరాత్ముడు, పాపకర్ముడు, మహాచపలుడు, కుఱుచ, రోగి, కడవతల, గొగ్గిపళ్ళు, మిడిగ్రుడ్లు, పల్లమీసములు, గూనిమూపు, ఇంకేమని వర్ణించను? రాజుగారి ఉల్లం రాయి కాకపోతే మహాలక్ష్మి వంటి మిమ్మల్ని ఆ కురూపికిస్తారా? వాడు దయ్యమనుకుని నా గుండె పగిలిపోయింది సుమీ! గారాబు పట్టిని, పుత్తడి బొమ్మని ఈ ముసలి పీనుగకు ఇవ్వటానికి ఈరాజు కిదేం బుద్ధి అని ఊరంతా వాపోతూ ఉంది. ఈడుజోడు కాని బడుగురాకాసితో నువ్వెలా కాపురం చెయ్యగలవు? అయ్యో! నేనేం చెయ్యను? ఎవరితో చెప్పుదును? నిన్నెలా చూడగలను?'' అని ఆ మాయజంత బుడిబుడి ఏడ్పులు ఏడ్చింది.

హంసావళి మూర్ఛిల్లింది.

కనకమంజరి నగుమొగం మాటుపుచ్చి ఉపచారములు చేసింది.

హంసావళి తన్ను తాను తెలిసికొన్నది.

''మంజరీ! నీవే నాకుదిక్కు. అట్టి రూపుగలవాణ్ణి చూడగానే నా ప్రాణం పైనే పోతుంది. నాకా మగడేల? ఆతని కిచ్చే తండ్రి ఏల? నీవెలానైనా నన్ను రక్షించు. నీవు నా చెలివి కావు చెల్లివి.''

''రాకుమారీ! నీ మనోరథం ఈడేర్చని నా తనువెందుకు? ఈ రాత్రికే మిమ్మల్ని ఇక్కడి నుండి తప్పించి, మీ వేషంతో ఆతని వరింపగలను. నాకు మీపోలికలు ఉండటంకూడా మంచిదేఅయింది.''

''నిజంగానా మంజరీ?'' హంసావళికి మంజరి ఓ దేవతలా కనబడింది.

''నిజం. మీపైన ఒట్టు. ఏవీ? మీ నగలూ, అవీ ఇవ్వండి. ఆలసించటానికి వ్యవధిలేదు'' అని తొందరించింది మంజరి.

''మంజరీ! నీ ఋణం ఈ జన్మకు తీర్చుకోలేను.''

''ఎంతమాట! కూరిమి చెలికి వచ్చిన పోరామికి అడ్డుపడని బోటి బోటియా?''

హంసావళి తన చీరలు, తన తొడవులు తీసి మంజరి కిచ్చివేయసాగింది. తన తలపే ఈడేరుతున్నందుకు కనకమంజరి మొగాన ప్రమదం తోచింది.

''మఱి నన్నెక్కడ దాస్తావు?''

''సంజ వెలుగులు కూడా సురిగి పోనివ్వండి''

సంజ వెలుగులు సురిగిపోయాయి. నగరిలో పెండ్లిసందడి అతిశయించింది. అంతిపురంలో హడావిడి అధికరించింది. అంధకారపు పరదాచాటున కనకమంజరి హంసావళిని పురి వెలుపలకు తోడుకొనిపోయి ఒక పూదోటకు చేర్చింది. అక్కడో పెద్దబూరుగు చెట్టుతొఱ్ఱలో రాకుమారిని దాచింది. తన్ను వీడిపోవటానికి తొందరించే మంజరిని చూచి "నీ మేలు మరువలే"నని మరీమరీ చెప్పింది హంసావళి.

"మీకేమీ భయములేదు. వేకువజామున ఈ ముసలి కమలాకరుని కనుమఱగి నీకడకు వస్తాను. వెఱవకండి" అని చీకటిలోనికి దూసుకుపోయింది కనకమంజరి.

ఓ గంట గడిచింది. తన చుట్టూ పాములు బుస్సంటున్నట్టే తోచింది హంసావళికి. దూరాన తూర్యనాదాలు మ్రోగుతున్నాయి.

తనకేమిటీ దురవస్థ! మహారాజు కుమార్తెయై ఊరిచివర చీకటిలో ఓ బూరుగు చెట్టులో పాములమధ్య ఉండవలసిన కర్మమేం పట్టింది?

ఆమెలో రాచనెత్తురు మండింది. వెంటనే తొఱ్ఱ నుండి వెలువడి ఆతోటలోనే ఒక పూపొదరింటి దాపునగడ్డిపై కూచుంది.

నడిజాము దాటింది.

కనకమంజరీ, కమలాకరుల వివాహం వైభవోపేతంగా ముగిసింది.

ముమ్మూర్తులా హంసావళినిపోలిన మంజరిని ఎవ్వరూ అనుమానించలేదు· రాకుమారి ఆనతిమేరకే యిలా చేస్తున్నానని అశోక కళికను నమ్మించింది మంజరి.

కమలాకరుడు కనకమంజరీ సహితుడై ఏనుగునెక్కి తన శిబిరానికి తరలినాడు. వెయ్యి కరదీపికల కాంతిలో వారిరువురూ విరాజిల్లుతున్నారు.

కాని కనకమంజరి కపటభావం ఇంకా తుదముట్టలేదు.

ఊరేగింపు ఊరివెలుపలి పూదోటను సమీపించింది.

హఠాత్తుగా మంజరి వడవడ వడకుతూ పతిని కౌగలించుకుంది. సొమ్మసిల్లినట్లు నటించింది. కొంతవడికి తెప్పరిల్లింది.

ఈరెలుంగుతో అతనికి మాత్రమే వినవచ్చేటట్లు చెప్పింది.

"అదిగో! ఆ బూరుగు చెట్టుపై ఒక రాక్షసి కన్నుల నిప్పులు రాలుస్తూ భయపెట్టింది. నేను సొమ్మసిల్లి నప్పుడొక బ్రాహ్మణుడు కనిపించి 'ఈచెట్టును తగలబెట్టింపకపోతే ఆరక్కసి మనలను మననీయ'దని చెప్పినట్లైనది."

"దీనికింత అడల పనిలేదు" అని కమలాకరుడు భటావళిని పిలిచినాడు.

"ఈ బూరుగుచెట్టును కాల్చివేయండి" అని ఆనతిచ్చాడు.

వెన్వెంటనే భటకోటి బూరుగుచెట్టును దహించింది. పెను మంటల కాంతిలో కమలాకరుని మూర్తి మనోహరంగా తోచింది.

తానుండవలసిన బూరుగు చెట్టు రూపఱి పోవడంతో పొద మాటుననున్న హంసావళి బెదరి భద్రగజం వైపు చూచింది.

చిత్తరువు నందలి చెలువుని చెలువమే దంతావళంపై కూడ చెలువారటం చూసి దిగ్భ్రమ పొందింది. కనకమంజరి కులుకుచూసి ఆమెకు సర్వం విదితమైంది. హంసావళి గుండె పగిలింది. ఆమె ఇలా పొగిలింది:

"నా మనోహరుడే ఈ కమలాకరుడు. ఈతని చెలువము కన్నార కనుగొని ఈ మాయలాడి కాముని బారి పడింది. మాయలు పన్ని పాపి నన్ను పాపి, నేర్పార అతని వరించింది. నన్ను పాముల పుట్టలో పెట్టి, తుదకు చెట్టునుకూడా కాల్పించింది. ఇంతకూ నేను దురదృష్టవంతురాలను. నన్ను కోరి ఏతెంచిన మారాకారునియెడ నాకేల అనుమానము కలుగవలె? సుందరుని కడకు నన్ను బోలిన జవ్వనిని పంపదగ దనక ఏల పంపవలె? నా తండ్రి సదుద్దేశమును నేనేల నమ్మనైతిని? తొలుబాముసం దీతడు ప్రాణేశ్వరుడు కాగల నోము నోచియుండను కాబోలు! ఆ ఇంతి తలపోసినట్లు చెట్టుతో బాటు ఏల దగ్ధము కాకపోతిని? ఇకపై నిచ్చలు మదనాగ్ని కీల లందు ఎట్లు కాలగలను?" అనుచు కన్నీరు వెల్లిగొనునట్లు ఆమె పలవింపసాగింది.

కాని దైవగతి చాల విచిత్రమైనది.

ఆ రాత్రి శిబిరం చేరగనే కమలాకరుడు ప్రబల జ్వరంవల్ల పీడితుడైనాడు. మూసిన కన్ను తెరవనే లేదు.

కనకమంజరి నల్లనూలిన చింతకు అగ్గమైనది

హంసావళి మృదుహస్తం నుదురు సోకగానే ఎంతటి జ్వరమైనా మటుమాయమవుతుందన్న ప్రతీతి ఈ కమలాకరుడు కూడ వినివున్నాడు.

ఇప్పుడెలా? ఈ అగ్నిపరీక్షలో నెగ్గగలదా?

ఉపాయాంతరం ఆలోచించింది మంజరి.

శివలింగాన్ని మేక నెత్తురుతో అభిషేకించి, మాంసంతో పూజించి, నరబలి అర్పిస్తే ఎలాంటి జ్వరమైనా శాంతిస్తుంద మునుపు ఒక జోగి చెప్పిన సంగతి గుర్తుకు వచ్చింది.

బాగానేవుంది కాని నరబలి ఎలా?

చప్పున అశోకకళిక గుర్తుకొచ్చింది మంజరికి.

భళా! దీనితో తన అంతరాంతరాళాల్లో దాగిన వంతల తొలగిపోతాయి!

తోడనే కళికను పిలిపించి, నరబలిని మినహాయించి తనజతన మంతా చెప్పింది. తోడు కమ్మని ప్రార్థించింది.

"రాకుమారి ఎక్కడ ?" అని సూటిగా అడిగింది కళిక.

"పాడుబడ్డ శివాలయానికి ఆవల తోటలో ఉంది. మన పని కాగానే అక్కడికి వెళ్దాం." సానునయంగా చెప్పింది మంజరి.

"ఏమో ! నీ వాలకం అంతా వింతగా వుంది సుమీ ! ఈ రాజును ప్రాణేశునిగా భావించిన రాకుమారి ఇదంతా చేయిస్తోంది అంటే నమ్మలేకండావున్నాను. పద. దీనిఅర్థం ఏమిటో అమ్మాయి గార్నే అడుగుతాను." అని కళిక, మంజరితో కూడి పూజాద్రవ్య మైన మేకతో సహా ఆ రాత్రివేళ ఊరి వెలుపలి శివాలయానికి వెళ్ళింది.

అభిషేకం కాగానే, కళికనే పూజకు నియోగించింది మంజరి. కళిక పూజలో నిగిపోయిన సమయంచూసి, మంజరి నగ్నకృతియై ఒక పెద్ద కత్తిని చేబూని కళిక మెడను నరక బోయింది. కాని ఇదంతా అరమోడ్పు కన్నులతో కనిపెడుతూఉన్న అశోకకళిక తప్పించుకుని, అగ్గలమైన హాహాకారాలుచేస్తూ ఒక్క గంతులో గుడి నుండి బయటపడింది.

కాని మంజరి వదల్లేదు. దిగంబర దేహంతోనే ఖడ్గం జళిపిస్తూ కళికవెంటబడింది. కళిక కేకలువేస్తూ కమలాకరుని శిబిరం వైపు పరుగిడసాగింది.

దారిలో తలవరులు ఎదురైనారు.

కళికకు ప్రాణం లేచి వచ్చింది.

"అన్నలారా! పాడుగుడిలోని దయ్యము నన్ను చంపితినుటకై వస్తోంది. చూడండి" అని మంజరిని చూపింది.

వస్త్రాపవరణ, ఆలంబకేశభార, ఆభీల కరవాల హస్త అయిన మంజరిని చూసి వారు నిజంగా భూతమేననుకున్నారు. ఒక్కసారిగా ఆమెపైబడి కత్తులతో తునియలు తునియలు గావించారు.

అశోకకళిక శోకిస్తూ కమలాకరుని శిబిరం ప్రవేశించింది.

నరబలికూడ ముగియుటం వలన జ్వరం పటాపంచలై ఆ రాకుమారుడు శయ్యపై లేచి కూచునివున్నాడు.

కళిక దీనాననయై అతని పాదములపైబడి జరిగినదంతా పూస గ్రుచ్చినట్లు నివేదించింది. రాకుమారుడు నిర్విణ్ణుడైనాడు.

"మరి హంసావళి ఏమైనట్లు ?"

"బహుశః తాము కాల్పించిన బూరుగు చెట్టుతోబాటు..." అశోకకళిక దుఃఖం కట్టలు త్రెంచుకుంది.

స్కంధావారం అంతటా హాహాకారాలు వ్యాపించి విదిశా నగరానికి కూడా విస్తరించాయి.

కాని అంధకారం విచ్చి సూర్యోదయం అయ్యేలోగానే మంచి కబురు వచ్చి అందర్నీ ఆనందసాగరంలో ముంచి తేల్చింది.

వేకువనే పూదోటకు వచ్చిన పుష్పలావికలు నేలవ్రాలియున్న హంసావళిని తీసికొనిపోయి మహారాజు కప్పగించారు.

అశోకకళిక శోకం తొలగింది.

కమలాకరుని హృదయకమలం విచ్చింది.

కాని హంసావళి కనకమంజరి పాటుకు దుఃఖించింది.

ఒక శుభముహూర్తాన హంసావళీ కమలాకరుల వివాహం అతి వైభవంగా జరిగింది.

* * *

"ఆ తరవాత తెలుగు సినిమా చూట్టం రోక్షం !"అంటూ తిరిగి చూడకుండా పక్కనేవున్న థియేటర్‌కి పరుగుచ్చుకున్నాను.

ఆట వొదిలారు. కథ అంటే ఏమిటో, భాష ఎలావుండాలో, రసాన్ని ఎలా పోషించాలో ఆ పాతకాలపు పెద్దమనిషికి చెప్పాలని మహా ఆవేశంతో రూము కొచ్చాను.

కాని అన్నయ్య అయిపులేదు.

షోడశ కుమారుల్ని వెదుక్కుంట్టూ అయిదు శతాబ్దాల వెనక్కి తరలిపోయాడు; మరలిరాడు.

అన్నయ్య కూచున్నచోటంతా వెన్నెలకల్లుగా మారిపోయింది.

